కాల్చలేం.. కొనలేం !

● పేలిపోతున్న టపాసుల ధరలు ● గతేడాది కంటే పెరిగిన టపాసుల ధరలు
● మార్కాపురంలో 17 దీపావళి మందుల షాపులకు తాత్కాలిక లైసెన్సులు
● అనధికారికంగా విక్రయిస్తే కేసులు నమోదు

మార్కాపురం: ఏటికేడు దీపావళి బాణసంచా కొనకుండానే పేలిపోతున్నాయి. మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో దీపావళి టపాసుల ధరలు చూస్తే కొనలేం అంటున్నారు ప్రజలు. తమిళనాడులోని శివకాశి, మన రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, చిలకలూరిపేట తదితర ప్రాంతాల నుంచి టపాసులు దిగుమతి అవుతున్నాయి. గతఏడాది కంటే ఈఏడాది ధరలు పెరిగాయి. రంగుల హరివిల్లు కురిపించే టపాసులు పెరుగుతున్న ధరలతో నామమాత్రంగా ప్రజలు కొనుగోలు చేసి దీపావళిని జరుపుకోనున్నారు. ఈనెల 20, 21 తేదీల్లో దీపావళి పండుగ నేపథ్యంలో మార్కాపురం పట్టణంలో దాదాపు 17 షాపుల్లో దీపావళి మందులను విక్రయించేందుకు అధికారులు తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేశారు. వీరందరూ మార్కాపురం పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్ముతారు. దీపావళి వస్తే పెద్దల కంటే పిల్లలకు ఎంతో ఉత్సాహం ఇస్తుంది. దీపావళి పండుగకు టపాసులు కొనుగోలు చేసి ఇంటిల్లిపాది కాలుస్తూ ఆనందంగా గడుపుతారు. అయితే పెరుగుతున్న ధరలతో పిల్లలకు టపాసులు కొనిచ్చి వారు కాల్చుతుంటే పెద్దలు ఆనందపడక తప్పటం లేదు. మార్కాపురం, పొదిలి, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో సుమారుగా 30 షాపులు ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది 20 నుంచి 30 శాతం రేట్లు పెరిగాయి. ధరలు ఇలా ఏటేటా పెరిగిపోవటంతో పిల్లల ఆనందం ఎలా ఉన్నా, పెద్దలు మాత్రం హడలిపోతున్నారు. ధరలు పెరగడంతో ప్రజల ఆనందం కొద్దిగా తగ్గించుకుని టపాసులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

టపాసుల ధరలు ఇలా...

టపాసుల పేర్లు	గతేడాది ధర	ప్రస్తుత ధర రూ.
కాకర పుల్లలు బాక్స్	1300	1400
చిచ్చుబుడ్లు బాక్స్	320	350
లక్ష్మీబాంబులు చిన్నది	380	420
లక్ష్మీబాంబులు పెద్దది	500	600
ఫ్లవర్ ఆటమ్ బాక్స్	250	350
వంకాయబాంబ్‌లు	250	350
100 వాలా	100	150
1000 వాలా	300	400
10000 వాలా	3000	3500
రాకెట్స్ బాక్స్	450	500
భూచక్రాలు బాక్సు	220	250
మతాబులు బాక్స్	225	270


విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న టపాసులు

అనధికారికంగా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు..



దీపావళి సందర్భంగా టపాసులు అనధికారికంగా అమ్మినా, గోడౌన్లలో నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటాం. షాపుల వద్ద నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. ఇసుక, నీటి సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలి, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ఫైర్, పోలీసులకు సమాచారం అందించాలి. టపాసులు కాల్చేటప్పుడు చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి.
– సుబ్బారావు, సీఐ

17 దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు..



ఈనెల 20, 21వ తేదీల్లో మాత్రమే తాత్కాలిక లైసెన్సులు పొందిన వ్యాపారులు దీపావళి టపాసులు అమ్మాలి. 17 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేశాం. పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాలలో వీటిని తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుని విక్రయించాలి. జనావాసాల మధ్య మందులు అమ్మితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ప్రతి షాపువద్ద కనీస మధ్య దూరం 3 మీటర్లు ఉండాలి. 200 లీటర్ల డ్రమ్ముల్లో నీటిని సిద్ధం చేసుకోవాలి.
– రామకృష్ణ, ఫైర్ ఆఫీసర్, మార్కాపురం

క్లుప్తంగా

పొలం రస్తాను కబ్జా చేసిన పచ్చ నేతలు

అర్ధవీడు: కూటమి ప్రభుత్వంలో పచ్చనేతల ఆక్రమణలు రోజురోజుకీ ఎక్కువయ్యాయి. మండల పరిధిలోని చీమలేటిపల్లిలో దక్షిణం నుంచి బైరవకొండకు, బూర్గ చెరువుకు వెళ్లడానికి సర్వే నంబర్‌లు 1007/19, 1009, 1024,1029, 1149లను గ్రామ పటంలో బండ్లదారి రెవెన్యూ అధికారులు 2024లో విడగొట్టారు. ఆ రస్తా వెంట రైతులందరూ రాకపోకలు నిన్నటి వరకు కొనసాగించేవారు. ఈ రస్తాపై టీడీపీ నాయకుల కన్నుపడింది. రాత్రికి రాత్రి అదే గ్రామానికి చెందిన పచ్చ నేతలు బండ్ల రస్తాను ఆక్రమించుకొని సోలార్ ఫెన్సింగ్ వేశారని అదే గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్తులు తెలిపారు.

నిబంధనలు పాటించని షాపులపై చర్యలు


సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: నిబంధనలు పాటించని దీపావళి షాపుల యజమానులపై చర్యలు తీసుకుంటామని మార్కాపురం సబ్‌కలెక్టరు త్రివినాగ్ హెచ్చరించారు. శనివారం సాయంత్రం ఆయన మార్కాపురం సీఐ సుబ్బారావు, కమిషనరు డీవీఎస్ నారాయణరావు, తహశీల్దార్ చిరంజీవి, ఫైరాఫీసరు రామకృష్ణతో కలిసి దీపావళి టపాసులు అమ్మే ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపులు ఏర్పాటు చేసే యజమానులు ఐరన్ రేకులతో షాపులను బిగించుకోవాలవాలన్నారు. షాపులకు మధ్య 6 నుంచి 9 అడుగుల దూరం పాటించాలని సూచించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవద్దని స్పష్టం చేశారు.

సైకిల్ తొక్కితే బహుళ ప్రయోజనాలు


సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కంభం: సైకిల్ తొక్కడం వలన శరీరానికి బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల తహసీల్దార్ వి.కిరణ్ అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సైకిల్ పై అధికారులు కార్యాలయానికి వచ్చి అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయాల్లోని పరిసరాలను సిబ్బందితో కలసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి, ఎంఈఓ అబ్దుల్ సత్తార్, డిప్యూటీ ఎంపీడీఓ విజయలక్ష్మి, కార్యదర్శులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

వాతావరణ కాలుష్యంపై అవగాహన తప్పనిసరి


మొక్క నాటుతున్న అధికారులు

బేస్తవారిపేట: ప్రతి ఒక్కరూ వాతావరణ కాలుష్యంపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీవో రంగనాయకులు అన్నారు. శనివారం బేస్తవారిపేటలో క్లీన్ ఎయిర్-క్లీన్ పొల్యూషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైకిల్ తొక్కుతూ అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ జిలానీబాషా, ఆర్‌డబ్ల్యూస్ జేఈ తావు నాయక్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వెలుగొండలో శ్రీవారికి పూజలు


అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు.

పశువుల షెడ్లను నచ్చిన వారికి ఇచ్చుకున్నారు

● వాడీవేడిగా మండల సమావేశం


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: పశువుల షెడ్లను నచ్చిన వారికి ఇచ్చుకుని అర్హులకు అన్యాయం చేశారని పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశహాలులో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కనీసం మండలానికి పశువుల షెడ్లు మంజూరైన విషయం ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఎలా ఎంపికచేశారని సమావేశంలో ధ్వజమెత్తారు. పిటికాయగుళ్లలో ఐదు పశువులు మృతి చెందితే పోస్టుమార్టం చేయాలని గలిజేరుగుళ్ల పశువైద్యాధికారిని అడిగితే గతంలో బీమా చేసిన వారితో చేయించుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం దారుణమని ఎంపీటీసీ సభ్యుడు తెలిపాడు. ఎంపీ చెరువు గ్రామంలో పశువుల మేత బీడును కమ్యూనిటీ ప్లాంటేషన్‌కు కన్వర్షన్ లేకుండా ఎలా చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యురాలు ప్రశ్నించారు. గతంలో ఆపిల్ బేర్ మొక్కలు నాటుకున్న రైతులకు రూ.13 లక్షలు మంజూరయ్యాయని రైతుల ఖాతాలకు ఎందుకు నగదు జమ చేయడం లేదని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్‌ను ప్రశ్నించారు. వెలుగు కార్యాలయంలో ఎంబుక్‌లు లేకపోవడంతో డ్వామా పీడీ అకౌంట్‌కు వెనక్కు నగదు పంపుతున్నట్లు తెలపడంతో ఎంపీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఓఏల తొలగింపులో బైలా నిబంధనలు పాటించలేదని, ఉన్నతి నిధుల వినియోగంపై సమావేశాలకు ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదని వెలుగు ఏపీఎం రఘునాథబాబును ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు ఎక్కడా ?

స్మార్ట్ రేషన్‌కార్డులు వచ్చినట్లు కూడా సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియదని, పిటికాయగుళ్లలో పితికేశ్వరస్వామి ఆలయం భూములు 35 ఎకరాలు ఉన్నట్లు రికార్డుల్లో ఉందని క్షేత్ర స్థాయిలో పొలం ఎక్కడ ఉందో తెలియదని, సర్వే చేసి తెలపాలని ఎంపీటీసీ సభ్యుడు కోరారు. బార్లకుంట ప్రాథమిక పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయని, బేస్తవారిపేటలోని మెయిన్ స్కూల్ వంటగది శిథిలావస్థకు చేరడంతో ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాకు రూ.2400 ప్రకటించి ఉపయోగం ఏంటని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, తహసీల్దార్ జితేంద్రకుమార్, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణానికి రక్షణ


వెలుగొండలో మొక్కలు నాటుతున్న విద్యార్థుల ర్యాలీ

మార్కాపురం: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ సూచించారు. శనివారం మార్కాపురం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన తహశీల్దార్ చిరంజీవితో కలిసి మొక్కలు నాటారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలునాటి సంరక్షించాలని సూచించారు. తహశీల్దార్ చిరంజీవి మాట్లాడుతూ పెళ్లిరోజు, పుట్టినరోజు సమయాల్లో మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్‌తోపాటు వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి జీవనానికి ఆధారం..

కొనకనమిట్ల: స్వచ్ఛమైన గాలి జీవనానికి ఆదారం, చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అంటూ పాఠశాలల విద్యార్థులు నినాదాలు చేశారు. శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొనకనమిట్ల, గొట్లగట్టు, వెలుగొండ, మర్రిపాలెం గ్రామాలల్లో పాఠశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత, చెట్ల పెంపకంపై ప్రజలకు అవగాహన కలిపిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓలు డాంగే షరీఫ్, బి.నరసింహారావు, ఈఓపీఆర్డీ శ్రీదేవి, వెలుగొండ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్స్ ఇబ్రహీం, సురేఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

అర్ధవీడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ కాశింపీరా, ఏవో వరప్రసాద్, ఏపీఓ కె శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, సిబ్బంది వెంకటయ్య, లక్ష్మీ, పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


మార్కాపురంలో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు


పూసలపాడులో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని పూసలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు హాకీ, టేబుల్ టెన్నిస్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జరుగుమల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో నారు నాగ సాయిభార్గవి, నాగిరెడ్డి యశ్వంత్, పీ రంగ ప్రణయ్, ఎం బిందుమాధవి, యు రమ్యశ్రీ, ఎం. ప్రకాష్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనపరచారన్నారు. మైనంపాడులో నిర్వహించిన హాకీ పోటీల్లో అండర్-14 విభాగంలో ఎం మధు కమల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థులను, పీఈటీ ఎం రాజశేఖర్‌లను హెచ్‌ఎం బొల్లా పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

మార్కాపురం విద్యార్థుల ఎంపిక..

మార్కాపురం టౌన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 కబడ్డీ, చెస్ పోటీల్లో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు బి నాగరాజు, ఎం అభి, టి నాగవిష్ణు, కబడ్డీ పోటీల్లో చెస్ విభాగంలో కౌశిక్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్లు శ్యామలా దేవీ, దామోదర్ రెడ్డి, ఓబులేసులను అభినందించారు.

కంభం విద్యార్థుల ప్రతిభ

కంభం: రాష్ట్ర స్థాయి అండర్-19 క్రీడల పోటీలకు ఇరువురు కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల సింగరాయ కొండలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 3 కిలోమీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ సంవత్సరం బైపీసి విద్యార్థి షేక్ నజీర్, కబడ్డీ పోటీల్లో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి షేక్ మహమ్మద్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఇరువురు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్మీడియట్ విద్యామండల పరీక్షల నియంత్రణ అధికారి ఎ. సైమన్ విక్టర్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.


షేక్ నజీర్


షేక్ మహమ్మద్

మెడికల్ కళాశాలను ప్రైవేటీకరించడం దారుణం


నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

● వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన
● కోటి సంతకాల సేకరణ


త్రిపురాంతకం: మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకులు విమర్శించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వేగంగా జరుగుతోంది. మండలంలోని నడిగడ్డలో శనివారం జరిగిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం సరైన నర్ణయం కాదని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల అవసరాలు, వైద్య రంగం అభివృద్ధికి, వైద్య విద్యలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలు నిర్మించారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ప్రైవేటు రంగం నుంచి వైద్య విద్య, వైద్య కళాశాలలకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్.రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, సుబ్బయ్య సుబ్బారెడ్డి, ప్రముఖులు పాల్గొన్నారు.

సోలార్‌తో విద్యుత్ పొదుపు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

గిద్దలూరు రూరల్: విద్యుత్‌ను పొదుపు చేయాలంటే సోలార్‌ను ఉపయోగించాలని విద్యుత్‌శాఖ డిఈఈ బి.శేషగిరిరావు అన్నారు. పీఎం సూర్యఘర్ లో భాగంగా శనివారం విద్యుత్‌శాఖ సిబ్బంది పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయం నుంచి రాచర్లగేటు నుంచి మెయిన్ బజారుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహాలకు, వ్యవసాయ బోర్లకు, సోలార్ ప్యానల్ అమర్చుకునే వారికి జీఎస్టీ 12 శాతం నుంచి 5 శాతం తగ్గించారన్నారు. సోలార్ వాడకంపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నారాయణరెడ్డి, లైన్‌మెన్లు కాశయ్య, రామిరెడ్డి, నాయక్, అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ప్రతిష్ఠ మహోత్సవాలు


పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి

కొనకనమిట్ల: మండలంలోని చినారికట్ల గ్రామంలో మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్న అంకమ్మతల్లి, గంగమ్మతల్లి, పోతురాజు స్వామి విగ్రహ, నవగ్ర దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మేళతాళాలు, భక్తుల కోలాహలం, జయజయ దానాలతో నిర్వహిస్తున్నారు. శనివారం వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాలతో నవగ్రహారాధన, వాస్తు దేవతారాధన, జప హోమార్చన, పారాయణము, సహస్రనామ పూజలు, బొడ్డురాయికి, పోలేరమ్మకు పూజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కళశ స్థాపనలో ఉభయదాతలుగా గ్రామస్తులు కంకణాలు ధరించి హోమాలు, అభిషేక పూజలు నిర్వహించారు. నేడు ఆదివారం అమ్మవార్లకు కుంకుమ బండ్లతో ఉత్సవం ఉంటుందని ఆలయ కమిటి సభ్యులు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, కంది శ్రీనివాసులరెడ్డి, గోదా వెలుగొండారెడ్డి, మారావతు వెంకటేశ్వర్లు, సొంగా శ్రీనాద్, ఏలూరి సంజీవరెడ్డి, బాలకృష్ణారెడ్డిలు తెలిపారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అర్ధవీడు: మండల పరిధిలోని మాగుటూరు గ్రామంలో లక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామికి శని త్రయోదశి ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. ప్రత్యేక పూలమాలలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులు హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతి సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

లక్ష్మీ చెన్నకేశవస్వామికి కల్యాణం


ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామివారు

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవి సమేతుడైన లక్ష్మీచెన్నకేశవస్వామివారి శాంతి కల్యాణాన్ని శనివారం స్వామివారి మధ్యరంగ మండపంలో అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించిన అనంతరం ఉభయదాతలు పట్టువస్త్రాలు సమర్పించగా ప్రధాన అర్చకులు అప్పనాచార్యుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. రాయలసీమ జిల్లా నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.